

# విన్నపాలు

ద్విభాష్యం రాజేశ్వరరావు

"ఈవేళ మన పెళ్ళి రోజు!...."

మృదువుగా అంది సుజాత.

తరువాత ఆమె కంఠం పూడుకుపోయినట్లయింది.

"అయితే!...." అన్నాడు రమణమూర్తి అసహనంగా.

"అంతేనా? అంతకంటే ఏమీ అనిపించటంలేదా మీకు?" మరింత మృదువుగా మెల్లగా మాట్లాడే యత్నంచేసింది సుజాత. సాధ్యమయినంత సహనం ప్రదర్శించి తన ఆలోచన ఆచరణలో పెట్టే యత్నంలో వుందామె.

"ఇలాటి పెళ్ళిరోజులు పదిహేనో, పదహారో వెళ్ళిపోయాయి. అనిపించటానికి ఏముంది ఇందులో? అయినా నువ్వు రచయిత్రివి కనుక నీ కేమయినా ప్రత్యేకంగా అనిపించవచ్చు, నా కేమీ అనిపించటం లేదు...."

అతని మాటల నిండా నిర్లక్ష్యం!

ముఖం నిండా చికాకు!

రెండు నిమిషాలసేపు నిశ్శబ్దంగా అతని ముఖం వంకే చూస్తూ వుండిపోయింది.

అతని కళ్ళు చింత నిప్పుల్లా వున్నాయి.

కనుపాపల క్రింద మృదుత్వం పోయి నల్లని చారలు చోటుచేసుకున్నాయి. సిగరెట్టుతో కమిలిపోయిన పెదాలు నల్లగా, మొద్దుగా వున్నాయి.

ఈ పదహారేళ్ళలో ఈ మనిషిలో ఎంత తేడా?!

ఎంత అందమయిన ముఖం ఎంత అసహ్యంగా మారిపోయింది?

ఎంత అందమయిన మనస్సు ఎంత అన్యాయంగా పతనమయిపోయింది.

సుజాత మనసు కలచివేసినట్లయింది!

"ఏం? నా ముఖంలో కోతులాడుతున్నాయా? లేక నీ కవితాహృదయంతో కొత్త అందాలు వెదుకుతున్నావా?" హేళనగా అడిగేడు రమణమూర్తి.

సుజాత అతనికి మరింత చేరువగా వెళ్ళింది.

"మీ ముఖంలో అందానికి ఏం తక్కువయిందని? కాకపోతే, పరిస్థితులు ఇలా వచ్చాయి కాని! మీ ముఖంలో రోజుకొక కొత్త అందం వెతుక్కుంటూ మీ గుండెలమీద తలపెట్టుకుని నిశ్చింతగా కాలం గడిపిన రోజులు నే నెలా మరిచిపోతాను?" అంది.

రమణమూర్తి కొంతసేపు మవునంగా వుండిపోయాడు.

"ఇంతకీ సంగతేమిటో చెప్పరాదూ? మళ్ళీ నేను బయటకు వెళ్ళాలి!" అన్నాడు.

"ఈవేళ నాతోటీ, పిల్లలతోటీ కనీసం ఒక అరగంట గడుపుతానని మాట ఇచ్చారు, మరిచిపోయారా?"

"మరిచిపోలేదు!"

"మరి, బట్టలు వేసుకుని తయారయి బయటకు వెళ్ళిపోతున్నారేం?"

"ఏం? శాసిస్తున్నావా?"

"శాసించే తెలివితేటలు నాకు భగవంతుడు ఇచ్చివుంటే మిమ్మల్ని ఇంతకంటే పదిలంగా చూసుకునేదాన్ని! మీరు ఇలా ఎందుకయిపోతారు?"

"ఇప్పుడు నే నేమీ అయిపోలేదు! అనవసరంగా బెంగపెట్టుకోకు! రాత్రి తిరిగివచ్చేక మాట్లాడుకుందాంలే! అప్పుడు కావాలంటే నీతోటీ, పిల్లలతోటీ గంటసేపు కబుర్లు చెబుతాను!" అన్నాడు పొడిగా.

సుజాత నిర్లిప్తంగా నవ్వింది.

"రాత్రి మీరు తిరిగివచ్చే సమయానికి మీరు ఇలా మాట్లాడగలిగే స్థితిలో వుంటారని మీకు నమ్మకం వుంటే — వెళ్ళిరండి! ఎంత రాత్రయినా సరే మీరు వచ్చేవరకూ నేనూ పిల్లలూ ఎదురు చూస్తూ వుంటాం. అందరం కలిసి భోజనంచేసి కబుర్లు చెప్పుకుందాం" అంది.

రమణమూర్తి ఏం చెప్పాలో తోచక తడబడ్డాడు.

సుజాత మాట అంటే అన్నంత పనీ చేస్తుంది!

తను తిరిగివచ్చే సమయానికి ఎలా వుంటాడో తెలుసు తనకు!

ఒక అరగంటసేపు ఇపుడు ఇంట్లో కూర్చుని ఆలస్యంగా బయటకు వెళ్ళటమే మంచిదనిపించింది అతనికి!

మారు మాట్లాడకుండా షర్టు విప్పి హేంగరుకు తగిలించి ఫేనుకింద కుర్చీలో కూలబడ్డాడు.

మరో కుర్చీ అతనికి దగ్గరగా లాగి అందులో కూర్చుంది సుజాత.

"నేను చెప్పేది కాస్త ఓపిగ్గా వినండి! ఈ పెళ్ళిరోజున మీరు నా కిచ్చే కానుక అదే! ఈ వేళ్టికి మన పెళ్ళి జరిగి పదహారేళ్ళు నిండేయి! పదిహేడో ఏట అడుగు పెడుతున్నాం!" అంటూ మాటలు ఆపి గొంతు సవరించుకుంది సుజాత.

"పిల్లలేరీ?...." తాపీగా అన్నాడు రమణమూర్తి.

"పై వరండాలో ఆడుకుంటున్నారు. నేను తరువాత పిలుస్తానులెండి! ముందు నన్ను మాట్లాడనివ్వండి!.... పెళ్ళయిన తరవాత పదేళ్ళపాటు ఏ బాధాలేకుండా గడిపేం మనం! ముచ్చటగా ఇద్దరు పిల్లలు పుట్టేరు మనకి! రోగాలు, రొచ్చులూ లేకుండా పెరుగుతున్నారు వాళ్ళు! మొదటి పదేళ్ళలోనూ మీ జీతంలో మిగిల్చిన డబ్బుపెట్టి ఇంట్లో మంచి ఫర్నిచరూ. 'ఫ్రిజ్' అమర్చుకున్నారు. నాకు సంగీతమంటే ఇష్టమని మంచి 'స్టీరియో డెక్' కొనిపెట్టేరు. సాహిత్యంలో అభిలాష వుందని మంచి పుస్తకాలు బోలెడు కొనిపెట్టేరు. ఇవన్నీ మీ ఆర్జనలోనివే! నాకు మంచి చీరెలూ, నగలూ కొన్నారు. మీరు వేసుకునే బట్టలు రవంత నలిగితే మార్చిపారేసేవారు. సెంటు పరిమళంతప్ప మరోవాసన మీ దగ్గరలో వెదికినా సోకేది కాదు!

"ఇవన్నీ ఆరేళ్ళక్రితం నాటివరకూ ముచ్చట్లు!

"అప్పట్లోనే మనింట్లో భూతం ప్రవేశించింది!

"మొదటిరోజుల్లో తాగి, ఇంటికి రాకుండా, ఫ్రెండురూములో వుండిపోయేవారు, నాకు తెలిస్తే బాధపడతానని!

"తరువాత ఇంటికివచ్చి మరుసటి దినమంతా నాతో మాట్లాడ్డానికి సిగ్గుపడేవారు! ఆ తరువాత— పార్టీలో తాగక తప్పింది కాదని సాకులుచెప్పి తప్పించుకునేవారు!! తాగటం తప్పుకాదనీ సొసైటీలో అదొక 'స్టేటస్ సింబల్' అనీ నాచేత ఒప్పించే ప్రయత్నంలో చాలారోజులు గడిచేయి.

"హద్దులో తాగితే ఫర్వాలేదనీ, బీరులోని ఆల్కహాలు ఆరుశాతం మాత్రమేననీ నాకు విడమరిచి చెప్పటంలో చాలా వారాలు గడిచిపోయేయి!

"బ్రాందీలో ఆకలి కల్గించే గుణం వుందనీ, తగు మోతాదులో డాక్టర్లు సేవించమని సలహాలు ఇస్తున్నారనీ విదేశీ పత్రికలలోని 'కొటేషన్స్' వెతికి చూపించి నాకు చెప్పటంలో ఆ తర్వాత చాలా నెలలే గడిచిపోయాయి.

"రాత్రి తలుపు బాది వీధిలో కూలబడిపోతే— తలుపు తీసి, పిల్లలకంటబడితే అసహ్యంగా వుంటుందని— మిమ్మల్ని గోలచెయ్యనియ్యకుండా బతిమాలి — గదిలోకి తీసుకువచ్చి పడుకోబెట్టటంలో — మరిన్ని సంవత్సరాలు గడిచిపోయాయి!

"మీలో ఈ ఆరు సంవత్సరాలలోనూ ఎంత క్రూరమయిన మార్పు వచ్చిందో చూసుకోగలుగుతున్నారా? మీ చుట్టూ అల్లుకొనివున్న మా జీవితాలలో కూడా ఎన్నెన్ని మార్పులు వచ్చాయో కనీసం మీరు ఊహించగలుతున్నారా?—"

ఊపిరి పీల్చుకోటానికి ఆగింది సుజాత!

'ఈ ఊపు వదిలేస్తే తాను చెప్పాలనుకుంటున్న రీతిలో మళ్ళీ చెప్పలేదు! మరింత మనోధైర్యం తెచ్చుకుని, గొంతులో మరింత మృదుత్వం పోసుకుని మళ్ళీ చెప్పటం ఆరంభించింది.

"మనకు ఆప్తులనుకున్న వాళ్ళందరూ ఒక్కొక్కరే మనకు దూరమయిపోతున్నారు. బంధువుల ఇంటికి మన రాకపోకలు తగ్గిపోయాయి. రాత్రిపూట బంధువులు వస్తే మీరు వాళ్ళతో కలిసి భోజనం చెయ్యరు! ఎందుకని? తాగకుండాతినటం కుదరదు కాబట్టి! సాయంకాలంపూటల్లో మనం పిల్లలతో కలిసి వెళ్లే షికార్లు పూర్తిగా మాయమయ్యాయి! మిత్రుల ఇళ్ళకువెళ్ళి కబుర్లు చెప్పుకుంటూ గంటల తరబడి గడిపి రాత్రి ఏ పదకొండు గంటలకో మసకవెన్నెల్లో తడుస్తూ నడిచి వచ్చి — అపుడు నేను వంటచేస్తూవుంటే నాకు సాయంచేస్తూ అన్నీ అందించేవారు.

"ఆ రాత్రులన్నీ ఏమయిపోయాయి?

"మనచుట్టూ వుండే పదిమందికీ మనం సలహాలు చెప్పేవాళ్ళం!

"ఇపుడో— అందరూ మనకే సలహాలు అందిస్తున్నారు!

"'మీ ఆయన మరీ మితిమీరిపోతున్నారు, కాస్త చెప్పరాదూ' అని ఒకరంటే; 'నువ్వు బొత్తిగా పట్టించుకోకపోవటం ఏమీ బాగాలేదమ్మాయ్!' అని మరొకరు; ఇలా ఎవరికి తోచిన రీతిలో వాళ్ళు మాటలు అంటూంటే గుండెల్లో గునపాలతో గుచ్చినట్లు వుంటోంది!

"మీరు వెళ్తూవుంటే మీ వెనుక గుసగుసలు! వెక్కిరింతలు? హేళనలు! నవ్వులు! అవి నా కంటబడితే నాకు ఎలా వుంటుందో ఎన్నడయినా ఆలోచించేరా? మొన్న 'న్యూ ఇయర్ పార్టీ'లో ఏమయిందో జ్ఞాపకంవుందా మీకు?

"మరీ మందు ఎక్కువయిపోయి క్లబ్బు వరండాలో ప్రభావతిగారి చెయ్యి పట్టుకున్నారు మీరు! ఆవిడ మహా ఇల్లాలు కనుక అల్లరిచెయ్యకుండా వెళ్ళిపోయి మరునాడు నాతో చెప్పింది!

"మరో దినం-తప్పతాగివచ్చి తలుపు తట్టడంకూడా మరిచిపోయి వీధిలోనే పడి నిద్రపోతూవుంటే- మన పక్కింటి రామయ్యగారు వచ్చి తలుపు తట్టి మిమ్మల్ని లోనికి తీసుకువచ్చిననాడు — 'నే నింకా ఎందుకు బతికివున్నాను భగవంతుడా?' అనిపించింది!!!

"నాలుగురోజులు సరదాగా నాతో గడిపి వెళ్దామని మా అక్కయ్య వస్తే - మీరు ఏం చేశారు ??

"నేను బాత్‌రూంలో వుండగా అది మీకు వీధితలుపులు తెరిస్తే - మైకంలో దాన్ని దగ్గరకు తీసుకోబోయారు.

" 'నీ మొగుడేమిటే! బొత్తిగా ఇలా తయారయ్యాడు!' అని మరునాడు ఈ సంఘటన చెప్తే నా ముఖం ఎలా అయిపోయిందో మీరు కనీసం ఊహించగలరా?

"ఈ వేళ మీ జీతం నెలకు రెండువేలకు పైచిలుకు! అయితే ఏం లాభం?

"అందులో సగం మీ తాగుడుకే అయిపోతోంది.

"పైగా ఇంతకుముందు మనం కొనుక్కున్న వస్తువులన్నీ ఒక్కొక్కటీ కాళ్ళొచ్చి వెళ్ళిపోతున్నాయి.

"అద్దెయింట్లో గోడకు బీరువాలు వున్నాయని మంచి గాద్రెజ్ బీరువా అమ్మేశారు! సెట్ పాతదయిపోయిందనీ, మళ్ళీ మోడలు మార్చి కొనుక్కుందామనే సాకుతో స్టీరియో డెక్ అమ్మేశారు!

"వ్యవసాయం చేయటం మనకు చేతకాదనీ, రైతు డబ్బుల్ని సరిగా ఇవ్వటం లేదనీ కారణాలుచెప్పి మీ నాన్నగారు ఇచ్చిపోయిన ఎకరంనర భూమీ అమ్మి పారేశారు! ఆ డబ్బు పన్నెండువేలూ మీ చేత ఫిక్సెడ్ డిపాజిట్‌లో వేయించాను. ఆఫీసులో స్నేహితునికి సహాయం చేయాలని, అప్పుగా ఇస్తాననీ చెప్పి దానిమీద 'లోను' పెట్టి అయిదువేల రూపాయలు తీసుకున్నారు. ఆ స్నేహితుడెవరో ఈ నాటికీ నాకు తెలీదు!!

"పిల్లలకు బట్టలు కుట్టించాలంటే 'మళ్ళీ నెల చూద్దాంలే' అని దాటవేస్తున్నారు. పండుగకు మంచి చీర కొనుక్కుంటానంటే 'నీకు మంచి చీరలకు కొదవేమిటి?' అని నన్ను బుజ్జగించేస్తున్నారు.

"మీ ఆఫీసు బట్టలన్నీ పాడయిపోయాయి. వారం అంతా ఒకటే జతతో గడిపేస్తున్నారు!

"సెంటు పరిమళం తప్ప వేరే వాసన తెలియని మీ దగ్గర బ్రాందీవాసన తప్ప మరేం రావటంలేదు!!

"మీ రెందుకిలా మారిపోయారు?

"మీలోని నిగ్రహశక్తి ఏమయిపోయింది?

"మీకు గుర్తుందా? పెళ్ళినాటికి మీరు సిగరెట్లు కాల్చేవారు. అయితే నాకావాసన పడదని ఒకరోజు మీతో అన్నాను. అంతే! కాలుస్తున్న సిగరెట్టు అవతలకు గిరాటేశారు. నాకు 'సారీ' చెప్పి ఆ అలవాటు మానేశారు. తరువాత పదేళ్ళు మీరు సిగరెట్టు ముట్టుకోలేదు. ఇదిగో, ఈ మహమ్మారితోబాటు మళ్ళీ సిగరెట్టు అరంభించేరు. ఆ వేళ్టి నిగ్రహశక్తి మీలో ఏమయింది?

"నేను ఇంతకాలం మీతో ఈ విషయం గురించి అంత సీరియస్‌గా చర్చించలేదు.

"మీ తెలివితేటలమీద నాకు నమ్మకం వుంది!

"మీ మంచితనంమీద విశ్వాసంవుంది!

"అందుకే ఆ అవసరంలేదనుకున్నాను. కాని నా విశ్వాసాలు, నమ్మకాలు నా మనిషిని బలితీసుకుంటాయని ఇపుడు భయం వేస్తోంది నాకు.

"మీరు ఏవిధంగా అందరికీ దూరమయిపోతున్నారో, అందరిలో చులకనయిపోతున్నారో ఒక్కసారి ఆలోచించండి!

"మీలో కలిగిన మార్పు ఎంత భయంకరమయినదో అర్థమవుతుంది!

"ఇంతసేపు నా మాటలను ఓపిగ్గా విన్నారు. అదే నాకు కొండంత బలాన్ని ప్రసాదించింది." సుజాత మాటలు ఆపి "శ్రీనూ! ఉషా! ఇలా రండి!" అని కేక పెట్టింది.

వీధి వరండాలోంచి శ్రీను, ఉష ఇద్దరూ వచ్చి ఎదురుగా అక్కడ నిలబడ్డారు.

"మీ నాన్నగారితో ఏదో మాట్లాడాలన్నారు కదా! మాట్లాడండి!" అంది సుజాత పిల్లలవంక చూస్తూ.

పదేళ్ళ శ్రీను తండ్రివంక చూస్తూ "నాన్నా, మమ్మల్ని 'జూ'కి తీసుకెళ్తానని ఎన్నిసార్లు చెప్పేవు. కాని తీసుకు వెళ్ళలేదు! మొన్నరాత్రి స్కూలులో ఫంక్షను జరిగితే అందరు నాన్నలూ వచ్చేరు. నువ్వు రాలేదు! రాత్రిపూట మాతో భోజనంచేయమంటే కలిసి తినవు నువ్వు! మా స్నేహితులందరి తండ్రులు వాళ్ళతో కలిసి ఎంచక్కా భోజనం చేస్తారు. నువ్వు మాతో కలిసితింటే మాకు బాగుంటుంది నాన్నా?" అంటూ పాఠం వల్లించినట్లు చెప్పి ఎదురుగా బయటకు వెళ్ళిపోయాడు.

"ఉషా! నువ్వు ఏం చెప్తావో చెప్పు!" అందిసుజాత పదేళ్ళకూతురివంక చూస్తూ.

"మరేమో, నువ్వు తాగుతావుట కదా! తాగుబోతు కూతురని అందరూ నన్ను స్కూల్లో ఏడిపిస్తున్నారు నాన్నా!" అంది బిక్కముఖంపెట్టి. తరువాత తన పాత్ర ముగిసినట్లు బయటకు నడుచుకుంటూ వెళ్ళిపోయింది!

సుజాత తలఎత్తి రమణమూర్తివంక చూసింది!

అతని చెంపలమీదుగా కన్నీళ్ళు కారిపోతున్నాయి!!!

——